## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- డిజిటల్ కనెక్టవిటీ భారత్ లో నూతన అవకాశాలను చూపించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు.
- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తన మంత్రి పదవులకు, రాజ్యసభ సభ్యత్వానికి ఈరోజు రాజీనామా చేశారు.
- భారత్ 2027లో 7 శాతం జీడీపీ వృద్ధి సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

డిజిటల్ కనెక్టవిటీ భారత్ లో నూతన అవకాశాలను చూపించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అందుబాటు ధరల్లో మొబైల్ డేటా లభ్యతతో విద్యార్థులకు డిజిటల్ విద్య, చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లను చేరుకునే అవకాశాలు, యువతకు ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ లో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, దేశంలోని ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం అవుతుందని, డిజిటల్ నైపుణ్యాలు భారత్ కు కీలకంగా నిలుస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, బలమైన పునాదులపై భారత్ ఆర్థికాభివృద్ధి కొనసాగుతోందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్...26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

లడఖ్ భారతదేశంలో అంతర్భాగమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. చైనా వైపు నుంచి ఎన్ని అభ్యంతరాలు వచ్చినా ఈ వాస్తవాన్ని మార్చలేవని పేర్కొంది. లడఖ్ పై చైనా ఇటీవల చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియా సమావేశంలో ఎదురైన ఒక ప్రశ్నకు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సమాధానమిస్తూ, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో అన్ని వివరాలు స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలోని 28 ప్రాంతాలకు సంబంధించిన ప్రామాణిక స్థల నామాలు, భౌగోళిక విశేషాల పేర్లను సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్ లో గుర్తించినట్లు హోం మంత్రిత్వ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. లడఖ్ ప్రాంతానికి చెందిన అధికారులు, స్థానిక భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ చర్య చేపట్టినట్లు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బింస్టెక్ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు బింస్టెక్ దేశాల్లో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ.. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్...21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార ప్రసార శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తన మంత్రి పదవులకు, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. శ్రామిక కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన తాను ప్రధానమంత్రి నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలిలో పనిచేసే అవకాశం లభించడం తన జీవితంలో అత్యంత గొప్ప గౌరవమని మురుగన్ ఆ లేఖలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయికి తిరిగి వెళ్లి పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ 2029 లోకసభ ఎన్నికలకు ముందు తమిళనాడులో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

శాస్త్రీయ సంస్థలు, సాయుధ దళాల మధ్య సన్నిహిత సహకారం జాతీయ భద్రతకు కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 66వ నేషనల్ డిఫెన్స్ కాలేజ్ కోర్సు అధ్యాపకులు, శిక్షణార్థులతో సమావేశమైన సందర్భంగా రాష్టపతి ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ భద్రత, సాంకేతిక రంగాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఫలితంగా సంక్లిష్టమైన కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆధునిక యుద్ధ తంత్రాలు సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా సైబర్ భద్రత, అంతరిక్ష సాంకేతికత, బయోటెక్నాలజీ వంటి రంగాలకు విస్తరించాయని, ఈ నేపథ్యంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే వ్యవస్థలకు ప్రాధాన్యం పెరుగుతోందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్...31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ 2027లో 7 శాతం జీడీపీ వృద్ధి సాధిస్తుందన్న అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనాను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ కుదుర్చుకున్న పలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడంతో పాటు, సరఫరా వ్యవస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అంతర్జాతీయంగా ఇంధన, ఆహార ధరలు పెరుగుతుండటం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు తీవ్రతరం కావడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తట్టుకునే సామర్థ్యం క్రమంగా బలహీనపడుతోందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కూడా భారత్ వృద్ధిపై ఐఎంఎఫ్ సానుకూల అంచనా వ్యక్తం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఎంపిక చేసిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే (పర్సన్ టు మర్చంట్) యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను దీపావళి తర్వాత అమలు చేయనున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని యూపీఐ సేవల స్టీరింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు NPCI తెలిపింది. ఈ విధానం అమల్లోకి వచ్చే తేదీని తరువాత ప్రకటిస్తామని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపై నిలబడి ఐక్యపోరాటం చేస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన తన నివాసంలో 'ఇండీ' కూటమి నాయకులకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు ఈరోజు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన వారిని కోర్టు ముందు నిలబెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. ప్రజలంతా తమతో ఉన్నారని దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నామని రాహుల్ గాంధీ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా యువత, ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఉద్దేశించిన దేశవ్యాప్త సామాజిక మాధ్యమ ప్రచార కార్యక్రమం ‘జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్’ (జోష్) ఈరోజు ప్రారంభమయ్యింది. దేశంలోని 11 రాష్ట్రాలు, 55 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మై భారత్ వాలంటీర్లు, నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్‌సీసీ) క్యాడెట్లు, నియమిత క్లాస్-1 అధికారులు ఈ ప్రచారంలో భాగస్వాములవుతున్నారు. క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం, వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స పొందేలా చూడటం ఈ ప్రచారం ప్రధాన లక్ష్యాలు. అలాగే, క్షయవ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, వివక్షను తగ్గించడం, చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా పూర్తిచేసేలా ప్రోత్సహించడం ద్వారా ముఖ్యంగా బలహీన, అణగారిన వర్గాలకు సహాయం అందించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =